క్లుప్తంగా

కన్నబాబురాజు నామినేషన్‌కు తరలివెళ్లనున్న నేతలు

మునగపాక : ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు తన నామినేషన్‌ను శుక్రవారం దాఖలు చేయనున్న నేపథ్యంలో మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లనున్నారు. యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో రమణమూర్తిరాజు నామినేషన్ దాఖలు చేసేందుకు ఆయనకు మద్దతుగా మండల వ్యాప్తంగా 4వేలకు పైగా పార్టీ శ్రేణులు వెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తరలివెళ్లడానికి ఏర్పాట్లు చేశారు. నాలుగో పర్యాయం కూడా రమణమూర్తిరాజు ఎమ్మెల్యే కావడం ఖాయమని ఇందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పార్టీ నేతలు కోరుతున్నారు. అలాగే ఉదయం 9 గంటలకు యలమంచిలికి బయలుదేరేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు.

11 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

పాయకరావుపేట : మండలంలో గల పాల్తేరు, సత్యవరం గ్రామాలకు చెందిన 11 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో కె.స్వప్న తెలిపారు. వీరందరూ విడివిడిగా రాజీనామా పత్రాలను రాసి ఇచ్చినట్లు తెలిపారు. పాల్తేరు గ్రామానికి చెందిన 10 మంది, సత్యవరం గ్రామానికి చెందిన 1 వలంటీరు రాజీనామాలు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తామందరం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ తమ విధులకు ఆటంకం కల్పించిన కారణంగా రాజీనామాలు చేసామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తామందరం కృషి చేస్తామన్నారు.

స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నా...



రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకి అందజేస్తున్న వలంటీర్ శివ

ఎస్.రాయవరం : పేదల ఆరాధ్య దైవంగా ఉన్న జగన్న గెలుపునకు తాను ప్రచారం చేయడానికి తనకు వలంటీర్ విధుల నుంచి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్టు నాళ్లం శివ పేర్కొన్నారు. లింగరాజుపాలెం గ్రామ వలంటీర్‌గా పని చేస్తున్న శివ ఇప్పటికే గ్రామపంచాయతీ అధికారికి రాజీనామా పత్రం అందజేసినప్పటికీ అంగీకరించలేదని, దీంతో గురువారం నేరుగా ఎంపీడీవో సత్యనారాయణకు రాజీనామా పత్రం అందజేసినట్టు చెప్పారు. తాను జగన్‌మోహన్‌రెడ్డికి వీర విధేయుడునని తెలిపారు. నేటి నుంచి ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న మరోమారు సీఎం అయ్యేందుకు ఫ్యాను గుర్తుకు ఓటు అడుగుతానని చెప్పి రాజీనామా ఆమోదించాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీవో రాజీనామా పత్రాన్ని తీసుకుని ఆమోదింప జేశారు.

21న పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్

ఎస్.రాయవరం : పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ఈ నెల 21 న పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ పాఠశాలలో ఇప్పటికే పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ నెల 27న పరీక్షకు వెళ్లే విద్యార్థులకు మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు హాజరై పరీక్ష రాయవచ్చన్నారు. ఆ విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని పరీక్షకు రావాలన్నారు. ఈ పరీక్ష నిర్వాహణకు జిల్లా పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ సభ్యులందరూ సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ :9700841744, 9381197776 నంబర్లను సంప్రదించాలన్నారు.

భానుడి భగభగలు

రాంబిల్లి: భానుడు భగభగలతో జనం అల్లాడిపోతున్నారు. మూడు రోజులుగా ఎండ తీవ్రత పెరిగిపోయింది. ఎండ తీవ్రతకు వడగాడ్పులు తోడుకావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.
ముఖ్యంగా పొలం పనుల్లో వున్న రైతులు, ఉపాధిహామీ పథకం కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రతకు రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

జోరుగా ఎమ్మెల్యే కంబాల జోగులు ప్రచారం



సత్యవరంలో తమలపాకు రైతులతో మాట్లాడుతున్న అభ్యర్థి కంబాల జోగులు



పాల్తేరు గ్రామంలో కంబాల జోగులు, వరుదు కల్యాణిలకు హారతులు ఇస్తున్న గ్రామస్తులు

పాయకరావుపేట : మండలంలో గల సత్యవరం, పాల్తేరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగిస్తూ హోరెత్తింది. వైఎస్సార్ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఎన్నికల ప్రచారం చురుగ్గా సాగిస్తున్నారు. సత్యవరం, పాల్తేరు గ్రామాల్లో నాయకులను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అభ్యర్థి కంబాల జోగులుకు పరిచయం చేస్తూ, ప్రచారం సాగిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరును కలిసి మే 13 న జరుగబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కంబాల జోగులును గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. సంక్షేమ పథకాలు యథా ప్రకారం కొనసాగాలంటే మనందరం మరలా వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగన్ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామంలో తమలపాకు రైతుల కష్టాలను, నష్టాలను ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి కార్యకర్తను, ప్రతి ఓటరును ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా తననూ, ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్సీ అంజూరి లక్ష్మి శివకుమారి, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, గ్రామ సర్పంచ్ సకిలేటి రాము, ఎంపీటీసీలు యగదాసు శేఖర్, తమ్మిర్సి సత్యనారాయణ, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, గ్రామ శాఖ నాయకులు గూటూరు వెంకటేశ్వరరావు, పడాల కృష్ణ, మాజీ సర్పంచ్ తమ్మిర్సి గంగారావు, పార్టీ జిల్లా సేవదళ్ కార్యదర్శి పాలపర్తి సతీష్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వేమగిరి లక్ష్మణ్, పట్టణ ఎస్సీ సెల్ కార్యదర్శి డి.నానాజీ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దేవవరపు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దేవవరపు అప్పలరాజు, నియోజకవర సోషల్ మీడియా కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ పెనుమత్య నాగేశ్వరరావు , సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, పన్నీరు బాబ్జి, మేడిశెట్టి రామగోవిందు, వంగలపూడి రామారావు, ఎంపీటీసీలు పల్లేల లక్ష్మణ్, గారా చక్రవర్తి, నాయకులు గుజ్జు గోవిందరెడ్డి, నీలాపు బాలకృష్ణారెడ్డి, తూము రాజుబాబు, తూము రమణ, కీర్తి నాగేశ్వరరావు, వల్లూరి రాజుబాబు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు గెలుపునకు గ్రామాల్లో పార్టీ నాయకులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. మండల కేంద్రంలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మత్స్యకార గ్రామాలైన కొత్త రేవుపోలవరం, బంగారమ్మపాలెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. జగన్‌బాబు మా పేదోళ్లకు ఎంతో మేలు చేశారు...ఆయనకే మా



ఎస్.రాయవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బొలిశెట్టి గోవిందరావు తదితరులు

మద్దతు అంటూ మహిళలు సమాధానం ఇస్తున్నారు. బంగారమ్మపాలెం గ్రామంలో ఉపాధి కూలీల వద్దకు సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు వెళ్లి ప్రచారం నిర్వహించగా, వారంతా ముక్తకంఠంతో ఫ్యాన్ గుర్తుకే మా ఓటు అని చెప్పారు. కొరుప్రోలు గ్రామంలోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, కొత్తరేవు పోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు వైఎస్సార్‌సీపీ నాయకులు మైలపలి రాజారావు, చోడిపల్లి కోదండ, మైలపల్లి అప్పలరాజు, గనగళ్ల రాజేష్, లక్కోజు ఆదిమూర్తి, చేకూరి శ్రీరామచంద్రరాజు, పినపాల పండు, పోలవరపు సత్యనారాయణ, నక్కా నాగేశ్వరరావు, పినపాత్రుని శ్రీనివాసరావు, యల్లపు నాగు పాల్గొన్నారు.



కొరుప్రోలులో ప్రచారం నిర్వహిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చేకూరి శ్రీరామచంద్రరాజు



బంగారమ్మపాలెంలో ఉపాధి కూలీలను ఓటు అడుగుతున్న సర్పంచ్ తదితరులు



కొత్త రేవుపోలవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న

తొలిరోజు నామినేషన్లు నిల్

- మోగిన ఎన్నికల నగారా
- విడుదలయిన నోటిఫికేషన్
- నామినేషన్ల స్వీకరణ ప్రారంభం



నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఆర్‌వో గీతాంజలి

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడులయింది. పాయకరావుపేట అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారి కె.గీతాంజలి గురువారం విడుదల చేశారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల వద్ద నోటిఫికేషన్ గెజిట్‌ను నోటిస్ బోర్డులో అతికించారు. ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఎమ్మెల్యే స్థానానికి జరిగే ఎన్నికలకు గాను నామినేషన్లను స్వీకరిస్తారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు గడువు ఈనెల 29వ తేదీ. మే 13న పోలింగ్ జరుగుతుంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆర్‌వో గీతాంజలి తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారం నుంచే ప్రారంభమైనప్పటికీ తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్లు స్వీకరించే నక్కపల్లి తాలూకా కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే కేంద్రం వద్దకు అనుమతిస్తున్నారు. మిగిలిన వారు బయట ఉండాల్సిందే. నామినేషన్‌ను అభ్యర్థి లేదా వారిని ప్రతిపాదించిన వారు దాఖలు చేయవచ్చు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ అభ్యర్థులకయితే ప్రతిపాదించేందుకు ఒకరు సరిపోతారు. స్వతంత్ర అభ్యర్థులయితే ప్రతిపాదించేవారు పదిమంది ఉండాలి. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం కాబట్టి డిపాజిట్ రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రాలతో పాటు, ఫారం 26 అఫిడవిట్ (ఆస్తులు, అప్పులు, కేసుల) వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ ఫారాలను తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు వద్ద అందుబాటులో ఉంచడం జరిగిందని ఆర్‌వో తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు, ఓటర్లు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌వో తెలిపారు. అభ్యర్థులు కొత్తగా బ్యాంకు ఖాతాలు తెరచి వాటి ద్వారానే ఎన్నికల ఖర్చులు చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్‌వో గీతాంజలి తెలిపారు. అభ్యర్థుల ప్రచారసరళి, ప్రచారంలో వినియోగించే వాహనాల అనుమతులు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అన్ని అంశాలను వీడియో చిత్రీకరిస్తున్నామన్నారు. ప్రత్యేక ంగా ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్‌లు కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు.

ముమ్మరంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల ప్రచారం



మునగపాకలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కాకరాపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు మంగారెడ్డి, సంతోష్, నాగిరెడ్డి

మునగపాక : వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణమూర్తిరాజులను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. కాకరాపల్లిలో వైఎస్సార్‌సీపీ నేతలు పిట్టా మంగారెడ్డి, సంతోష్, నాగిరెడ్డి తదితరులు ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యేందుకు సహకరించాలన్నారు. తద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మునగపాకలో ఉపాధిహామీ పథకం పనులు చేస్తున్న కూలీలను వైఎస్సార్‌సీపీ నేతలు ఓట్లు అభ్యర్థించారు. మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రమణమూర్తిరాజు నాయకత్వం అవసరమని జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, పార్టీ నేతలు ఆడారి కాశీబాబు, టెక్కలి కొండలరావు, పొలిమేర గణేష్, పెంటకోట సత్యనారాయణ, పిల్లి అప్పారావు, బోడకుర్తి గణేష్, ఎం.ఎం.నాయుడు పాల్గొన్నారు.

యలమంచిలిలో తొలిరోజే బోణీ

- మూడు నామినేషన్ల దాఖలు
- ఆర్వో కార్యాలయం వద్ద గట్టి బందోబస్తు

యలమంచిలి రూరల్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు యలమంచిలి ఆర్వో కార్యాలయం అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించారు. యలమంచిలి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ జనసేన పార్టీ తరపున రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రీఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున యలమంచిలి మండలం తెరువుపల్లికి చెందిన బోజా నాగేశ్వర్రావు నామినేషన్ పత్రాన్ని ఆర్వోకు అందజేశారు. నామినేషన్ల ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా యలమంచిలి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. వందమీటర్ల వరకు బారికేడ్లతో పాటు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. యలమంచిలి సీఐ షేక్ గఫూర్, పట్టణ ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో కఠిన ఆంక్షలు అమలు చేశారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు

జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి కార్యకర్తలు, మహిళలను డబ్బిచ్చి వివిధ వాహనాల్లో యలమంచిలికి తరలించారు. ఈ వాహనాలన్నీ అడ్డదిడ్డంగా నిలిపివేయడం, తరలివచ్చిన కార్యకర్తలు ద్విచక్రవాహనాలతో హల్‌చల్ చేయడంతో యలమంచిలి ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆర్టీసీ బస్సులు పట్టణంలోకి రావడానికి వీలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు వారు ప్రయాణించాల్సిన బస్సులను పట్టణ పొలిమేరలో నిలిపివేయడంతో వారంతా ఎండలో బస్సుల వద్దకు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేడు కన్నబాబు నామినేషన్



కన్నబాబురాజు

యలమంచిలి రూరల్ : యలమంచిలి నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుస్తున్న ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకట రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. అంతకుముందు ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారిని దర్శించుకుని యలమంచిలిలో పార్టీ కార్యాలయానికి వచ్చి అక్కడ్నుంచి ర్యాలీగా యలమంచిలి ఆర్వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నారు. కన్నబాబుకు మద్దతుగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి కార్యకర్తలు,నాయకులు భారీగా తరలిరానున్నారు.

సీఎం బస్సు యాత్రకు ఘన స్వాగతం పలకాలి



నక్కపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

నక్కపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం బస్సు యాత్రకు ఘన స్వాగతం పలకాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. గురువారం ఆయన నక్కపల్లి సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న శుక్రవారం రాత్రికి సీఎం జగనన్న బస్సుయాత్ర అనకాపల్లి జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. జాతీయ రహదారి మీదుగా పాయకరావుపేట చేరుకుంటుందన్నారు, వైజంక్షన్‌లో పాయకరావుపేట మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు జగనన్నకు ఘనంగా స్వాగతం పలుకుతారన్నారు. అక్కడ నుంచి నక్కపల్లి మండలం గొడిచర్ల చేరుకుని జాతీయ రహదారి పక్కన రాత్రి బస చేస్తారన్నారు. 20వ తేదీ శనివారం ఉదయం జిల్లాలో జగనన్న రోడ్‌షో ప్రారంభమవుతుందన్నారు. గొడిచర్ల నుంచి జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి చేరుకుంటుందన్నారు. అక్కడ రోడ్ షో అనంతరం అడ్డురోడ్డులో రోడ్‌షో పూర్తి చేసుకుని యలమంచిలి చేరుకుంటుందన్నారు. అక్కడ స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలుకుతారన్నారు. అక్కడ నుంచి తాళ్లపాలెం సమీపంలో జరిగే సిద్ధం బహిరంగ సభలో సీఎం పాల్గొంటారన్నారు. బస్సుయాత్ర ద్వారా జిల్లాలో రోడ్‌షో నిర్వహిస్తున్న జగనన్నకు నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. ప్రతి గ్రామం నుంచి అభిమానులు స్వచ్ఛందంగా తరలిరావాలన్నారు. నక్కపల్లి ఆర్‌టీసీ కాంప్లెక్స్ కూడలికి మండలంలో ఉన్న కార్యకర్తలంతా తరలి రావాలన్నారు. మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమేనన్నారు. దేశవ్యాప్తంగా పలు ప్రముఖ సంస్థలు నిర్వహించిన సర్వేల్లో రాష్ట్రంలో రెండోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్న విషయాన్ని వెల్లడించాయన్నారు.

22న కంబాల జోగులు నామినేషన్

ఈనెల 22న పాయకరావుపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు నామినేషన్ దాఖలు చేయనున్నారని, ఈ కార్యక్రమానికి కూడా ప్రతి గ్రామం నుంచి 200 మందికి తక్కువ లేకుండా కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని బొడ్డేడ ప్రసాద్ కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు బాధ్యత తీసుకుని నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మణిరాజు, పాపారావు, తాతబాబు, జేసీఎస్ కన్వీనర్ గోవిందు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న 13 మంది విద్యార్థులు (ఎం.పావని, ఎ.నాగలక్ష్మి, యు.ప్రజ్ఞ, వై.ఎస్.వి.మృణాళిని, జి.సాయి శ్రావణి, వసంత సుష్మ, వి.శ్రావణి, టి.జయశ్రీ, ఎస్.కె.మీనజ్, పి.ఈశ్వర్, ఎస్.వి.ఆర్ జశ్వంత్, వి.సుష్మిత, కె.హేమలత) శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించినట్టు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. కళాశాలలో రెగ్యులర్ క్లాసులతో పాటు విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రెనింగ్ ప్రోగ్రాములు, ఇంటర్వ్యూలకు తగినటువంటి శిక్షణ ఇవ్వడం ద్వారా తమ విద్యార్థులు ఎక్కువ ప్రాంగణ ఎంపికల ద్వారా ఉద్యోగ అవకాశాలు సాధిస్తున్నారని ఆయన తెలిపారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ సభ్యులు గ్రూపు డిస్కషన్, రాత పరీక్ష, సాంకేతిక ఇంటర్వ్యూ, హెచ్ఆర్ ఇంటర్వ్యూ ద్వారా విద్యార్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించినట్టు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అచ్యుతాపురంలో పద్మజా సుజుకీ షోరూం ప్రారంభం



పద్మజా సుజుకీ షోరూం ప్రారంభోత్సవంలో అతిథులు

అచ్యుతాపురం : అచ్యుతాపురంలో పద్మజా సుజుకీ షోరూంను గురువారం వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురంలో సుజుకీ కస్టమర్లకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, వర్క్ షాప్‌ను ప్రారంభించామన్నారు. అతి తక్కువ డౌన్‌పేమెంట్, అతి తక్కువ వడ్డీరేట్లు, అత్యుత్తమ ఫైనాన్స్ స్కీంలు కలిగి ఉన్న షోరూం అని తెలిపారు. అధునాతన సౌకర్యాలు కల్పించామన్నారు. కస్టమర్లు వంద శాతం సంతృప్తి పొందుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ రీజనల్ మేనేజర్ శివరామకృష్ణ, సర్వీస్ రీజనల్ మేనేజర్ సునీల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, జీఎం రఫీ వినియోదారులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతలపై కేసులు

బుచ్చెయ్యపేట: మండలంలో ఏడు గ్రామాల్లో మద్యం, సారా అమ్మకంపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు.

హోమ్ పోలింగ్‌పై దృష్టి సారించాలి



వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న అధికారులు

మునగపాక : హోమ్ పోలింగ్‌పై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. గురువారం సాయంత్రం ఆయన ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 85 సంవత్సరాలు పైబడి అనారోగ్యంతో బాధపడే వారు, అలాగే దివ్యాంగుల కోసం వారి ఇంటికి వెళ్లి ఓటు వేసే ప్రక్రియ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి సమన్వయం చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అందరూ కృషి చేయాలన్నారు. తహసీల్దార్ పి.పాపారావు, ఎంపీడీవో మన్మథరావు, డీటీ వినయ్‌కుమార్, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి తదితరులు కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

నేడు వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో ప్రసిద్ధి చెందిన వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి 7 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు అత్తిలి సత్య వెంకట కేశవ కోదండపాణి తెలిపారు. చైత్ర శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ ఆవరణలో నృసింహస్వామి, లక్ష్మీదేవిల ఉత్సవ విగ్రహాలకు కల్యాణాన్ని వేగి తారకేశ్వరరావు, పరమేశ్వరి దంపతులతో జరిపించనున్నట్టు చెప్పారు. అనంతరం ప్రసాద వితరణ చేస్తామన్నారు. కల్యాణానికి ముందుగా మధ్యాహ్నం 3గంటలకు స్వామి రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24న రాత్రి 7 గంటలకు పుష్పాంజలి కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్ లైన్ల మరమ్మతుల పనుల నిమిత్తం మండలంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 19, 20 తేదీల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నారు. కొత్తూరు పరిధిలో పిసినికాడ, సత్యానారాయణపురం, మూలపేట, వేట జంగాల పాలెం, సంపతిపురం, కుంచంగి, కూండ్రంలలో శుక్ర,శనివారాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. గాంధీనగరం విద్యుత్ శాఖ డి-1 సెక్షన్ పరిధిలో లక్ష్మీదేవిపేట, గాంధీనగరం , మిరియాల కాలనీ, ఆర్అండ్‌బీ బంగ్లా ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3.30 నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ కె.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

20 నుంచి వేసవి శిక్షణ తరగతులు

అనకాపల్లి: స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఈనెల 20నుంచి 30వ తేదీ వరకు కల్యాణి అకాడమీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు అకాడమీ కరస్పాండెంట్ ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగీతం, కూచిపూడి నాట్యం, వెస్ట్రన్ డ్యాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, కీబోర్డు, గిటార్ తదితర అంశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థినీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.